అర్హతే ప్రామాణికంగా పింఛన్లు

ఎమ్మెల్యే పేర్ని నాని



పింఛన్లను అందజేస్తున్న ఎమ్మెల్యే పేర్ని నాని

చిలకలపూడి(మచిలీపట్నం): లంచాలు, అవినీతికి తావు లేకుండా అర్హతే ప్రామాణికంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు పింఛన్లు అందజేస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో బందరు మండలంలోని 34 పంచాయతీల్లో నూతనంగా మంజూరైన 397 పింఛన్లను లబ్ధిదారులకు అందజేసే కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా పేర్ని నాని మాట్లాడుతూ.. మండల పరిధిలో కొత్త, పాత పింఛన్లు కలిపి 12 వేలు, నియోజకవర్గ వ్యాప్తంగా 30 వేలకు పైగా లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్నామని వివరించారు. గత ప్రభుత్వంలో పింఛన్లు కావాలన్నా, రేషన్‌కార్డు మంజూరు చేయాలన్నా లంచం ఇవ్వాల్సి వచ్చేదని గుర్తుచేశారు. అటువంటిది తమ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు, రేషన్‌కార్డులు అర్హులు అందరికీ అందుతున్నాయని తెలిపారు. మండలంలోని 397 నూతన పింఛను లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కష్టకాలంలోనూ సంక్షేమ కార్యక్రమాలను యథావిధిగా కొనసాగిస్తున్నారని కొనియాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 64 లక్షల మందికి పింఛన్లను అందజేస్తున్నట్లు తెలిపారు. ఆర్థికంగా, సామాజికంగా దెబ్బతిన్న వారికి ఈ పింఛన్లు ఆసరగా ఉంటాయన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన లబ్ధిదారుని ఇంటి ముంగిటకే పింఛన్ నగదు అందించటం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే సాధ్యమైందన్నారు. అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కష్టించి పనిచేస్తున్నారని వారికి అభినందనలు తెలిపారు. ఇంత మందికి పింఛన్లు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నియోజకవర్గ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ జి.వి.సూర్యనారాయణ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లంకే వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మేకా శ్రీనివాసరావు, తోట సత్యనారాయణ, వాలిశెట్టి రవిశంకర్, శ్రీకాకుళపు నాగేశ్వరరావు, ఆయా గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

మరోసారి ఆదరిస్తే మరిన్ని సంక్షేమ పథకాలు



బందలాయిచెరువులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు తదితరులు

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

బందలాయిచెరువు(అవనిగడ్డ): ఇచ్చిన హామీన్నింటినీ అమలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి మరోసారి అవకాశం ఇస్తే మరిన్ని సంక్షేమ పథకాలు అమల్లోకి వస్తాయని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పేర్కొన్నారు. బందలాయి చెరువు గ్రామంలో ఎమ్మెల్యే సింహాద్రి, ఆయన తనయుడు వికాస్ శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఎమ్మెల్యే స్వగ్రామం కావడంతో స్థానికులు ఎమ్మెల్యేకు ఎదురేగి ఆప్యాయంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నారని వివరించారు. ఈ సందర్భంగా కొంత మంది రహదారులు నిర్మించాలని, పింఛన్ల ఇప్పించాలని కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ, ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలజాకుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు సింహాద్రి వెంకటేశ్వరరావు, రేపల్లె శ్రీనివాసరావు, అన్నపరెడ్డి రాందాస్, షేక్ నజీర్‌బాషా, ఉపసర్పంచ్ గాజుల జయగోపాల్, సింహాద్రి రామనాథబాబు, గాజుల రాముడు, పర్చూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న కిట్టు

మచిలీపట్నంలో..

మచిలీపట్నంటౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధే ప్రధాన ధ్యేయంగా పాలన అందిస్తోందని వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. నగరంలోని 36వ డివిజన్‌లో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ మాచవరపు రాంప్రసాద్‌తో కలిసి పేర్ని నాని నగర్, రాజుపేట ప్రాంతంలో పేర్ని కిట్టు ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయా ప్రాంతాల్లో పేర్ని కిట్టుకు స్థానికులు పూలమాలలు వేసి పూలవర్షం కురిపిస్తూ ఘనస్వాగతం పలికి హారతులిచ్చారు. కార్పొరేటర్లు గోపిశెట్టి సతీష్, ఐనం తాతారావు, కోఆప్షన్ సభ్యులు మట్టా తులసి, బేతపూడి రవి, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్లు జవ్వాది రంబాబు, శ్రీకాకోళపు రేణుకారాణి, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎగ్గోని గాంధీ, దార్ల చెన్నకేశవరావు, పురంశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తాపీ కార్మికుల కుటుంబాలకు పరామర్శ



బుజ్జి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, నరసింహారావు

చల్లపల్లి: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తాపీ కార్మికులు మృతి చెందటం బాధాకరమని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. ఇటీవల ఘంటసాల మండలం జీలగలగండి వద్ద కారు ఢీకొని చల్లపల్లి నారాయణరావు నగర్ కాలనీకి చెందిన అబ్దుల్ షరీఫుద్దీన్ (బుజ్జి), గొడపాలెంలో మార్గాని శివ కోటేశ్వరరావు (కోటి) మృతిచెందారు. వారి కుటుంబాలను శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, వైఎస్సా సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడవకొల్లు నరసింహారావు పరామర్శించారు. వారి కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. విశ్రాంత లైబ్రేరియన్ వక్కలగడ్డ విశ్వేశ్వరరావు మాతృమూర్తి ఇటీవల మృతి చెందగా, ఆయన కుటుంబాన్ని కూడా ఎమ్మెల్యే పరామర్శించారు. వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ నసీంఘోరీ, అబ్దుల్ కమాల్, మద్దాల వీరాస్వామి, ఏఎంసీ డైరెక్టర్ అబ్దుల్ అర్షద్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణం వేగవంతం చేయండి

అధికారులకు ఎమ్మెల్యే పేర్ని నాని సూచన

మచిలీపట్నంటౌన్: నగరంలోని గొడుగుపేటలో జీర్ణోద్ధారణ చేస్తున్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులు వేగవంతం చేసి, త్వరగా పూర్తి చేయాలని అధికారులకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) సూచించారు. పూర్తిగా శిథిలమైన ఈ ఆలయాన్ని పునర్నిర్మించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రూ.1.80 కోట్లు మంజూరు చేశారని, మరో రూ.20 లక్షలు భక్తుల సహకారంతో సేకరించామని పేర్కొన్నారు. ఈ పనులు చివరి దశకు చేరాయని ధ్వజస్తంభాన్ని సిద్ధం చేసే పనులు, మండపం శ్లాబు, ఉత్తర ద్వారం ఫినిషింగ్ పనులు, గరుడాలయం, దేవాలయ కార్యాలయం శ్లాబు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని దేవదాయ శాఖ ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమం మార్చి ఒకటో తేదీన నిర్వహించేందుకు పండితులు నిర్ణయించారని తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ధ్వజస్తంభం సిద్ధం చేసేందుకు రూ.6.95 లక్షలు ఖర్చవుతుందని, ఇప్పటికే రూ.4.65 లక్షలు ఖర్చు చేశామని తెలిపారు. ఆలయ ప్రాంగణం మెరక చేసే పనులు నిర్వహిస్తామన్నారు. ఆలయ గోపురం, గర్భాలయం, మండపం పనులు పూర్తి చేసి రంగులు వేసే పనులు చివరిదశకు చేరాయని వివరించారు. వీలైనంత త్వరలో ఈ పనులు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఘనాపాటి విష్ణుభట్ల సూర్యనారాయణ శర్మ, కార్పొరేటర్లు గోపిశెట్టి సతీష్, కాగిత జవహర్‌లాల్, తరకటూరు ఎంపీటీసీ సభ్యుడు జక్కా ధర్మారాయుడు, ఆలయ ఈఓ సమ్మెట ఆంజనేయస్వామి వైఎస్సార్ సీపీ నాయకులు నూకల ప్రసాద్, శ్రీకాకోళపు గుప్తా, మరీదు నాగరాజు, సూరి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో పీఏసీఎస్ భవనం ప్రారంభం

మోపిదేవి: మండలంలోని పెదకళ్లేపల్లిలో శ్రీ ఆంజనేయ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన భవనాన్ని త్వరలోనే ప్రారంభిస్తామని పీఏసీఎస్ చైర్ పర్సన్ అరజా లక్ష్మీతులసి తెలిపారు. ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు సహకారంతో శిథిలావస్థకు చేరిన సొసైటీ భవనాన్ని పూర్తిగా తొలగించి రూ.62.50 లక్షలతో 4,700 అడుగుల విస్తీర్ణంలో గోడౌన్, పీఏసీఎస్ కార్యాలయంతో రెండు అంతస్తుల భవనాన్ని నిర్మించామని తెలిపారు. మాజీ సర్పంచ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ అరజా వెంకట సుబ్బారావు రూ.2.50 లక్షలు విరాళంగా ఇచ్చారని పేర్కొన్నారు. కేడీసీసీ బ్యాంకు నిధులు రూ.32 లక్షలు, నాబార్డ్ నిధులు రూ.23 లక్షలు, సొసైటీ నిధులు రూ.5 లక్షలతో పాటు విరాళంగా వచ్చిన రూ.2.50 లక్షలు మొత్తం రూ.62.50 లక్షలతో శరవేగంగా భవన నిర్మాణం పూర్తిచేసినట్లు తెలిపారు. అనుకున్న దానికంటే ముందుగానే నిర్మాణం పూర్తిచేశామని, త్వరలోనే ప్రారంభిస్తామని చైర్ పర్సన్ పేర్కొన్నారు.

డొంకరోడ్ల అభివృద్ధికి చర్యలు

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల మార్కెట్ యార్డు పరిధిలోని డొంకరోడ్లు అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఏఎంసీ నూతన చైర్మన్ వేమూరి వెంకట్రావు తెలిపారు. తెలుగురావుపాలెం సచివాలయ కన్వీనర్ పైడిపాముల కుసుమ ఆధ్వర్యంలో పలువురు పార్టీ నాయకులు, వలంటీర్లు వెంకట్రావును శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పొలాల నుంచి ధాన్యాన్ని ఇళ్లకు చేర్చుకునేందుకు వాహనాలు వెళ్లేందుకు అనువుగా డొంకరోడ్లను బాగుచేస్తామన్నారు. వార్డు సభ్యులు గురిందపల్లి శివరామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు పెనుమత్స పవన్, పైడిపాముల ఆనంద్, మునిపల్లి చంటి, తొండేటి వినయ్, పరిశె సంపూర్ణ, గురిందపల్లి లావణ్య తదితరులు వెంకట్రావును అభినందించారు.

అంగన్‌వాడీ భవనాలకు శంకుస్థాపన

కృత్తివెన్ను: మండలంలోని మూడు గ్రామాల్లో అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు ఎంపీపీ గరుడప్రసాద్, జెడ్పీటీసీ సభ్యులు రత్నకుమారి శుక్రవారం శంకుస్థాపన చేశారు. లక్ష్మీపురం దళితవాడ, చినచందాల, నిడమర్రు దళితవాడల్లో భవన నిర్మాణాలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. నాడు-నేడు ఫేజ్-2లో భాగంగా ఒక్కొక్క భవనాన్ని రూ.16 లక్షలతో నిర్మిస్తామని పేర్కొన్నారు. ఈ నిధుల్లో రూ.2.5 లక్షలు ఫర్నిచర్‌కు మిగిలిన రూ.13.5 లక్షలు భవన నిర్మాణం కోసం ఖర్చుచేస్తామని ఐసీడీఎస్ సీడీపీఓ సముద్రవేణి వివరించారు. ఏఎంసీ చైర్మన్ గంగాధర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెంకట్రాజు, ఏపీ స్కిల్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ భూపతిరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్యామలగౌరీ, సర్పంచ్‌లు సుబ్రహ్మణ్యం, నాగార్జున, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పార్కు ప్రారంభం



పార్కును ప్రారంభిస్తున్న డెప్యూటీ మేయర్ కవిత, కార్పొరేటర్లు

మచిలీపట్నంటౌన్: స్థానిక 13వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన రాబర్ట్ టర్లింగ్టన్ నోబుల్, జాన్ ఎడ్మండ్ షార్కీ నగరపాలక సంస్థ పార్కును స్థానిక కార్పొరేటర్ గాజుల శ్రీదేవి, డెప్యూటీ మేయర్ తంటిపూడి కవిత, కార్పొరేటర్లు రామిశెట్టి వాణిశ్రీ, చిత్తజల్లు ప్రసన్న, తాతారావు, షేక్ ముంతాజ్‌బేగం శుక్రవారం రాత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) పాల్గొన్నారు. రైలుపేట మునిసిపల్ పాఠశాల పక్కన అన్ని హంగులతో ఈ పార్కును తీర్చిదిద్దారు. వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జ్ గాజుల భగవాన్, మాజీ కౌన్సిలర్ గాడెల్లి డేవిడ్‌శామ్యూల్, పార్టీ నాయకులు బందెల థామస్‌నోబుల్, మొహమ్మద్‌సాహెబ్, మొహమ్మద్‌రఫీ, బూరగ రామారావు, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ జవ్వాది రాంబాబు, కో-ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి తదితరులు పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో శ్రీమన్నారాయణుడి అధ్యయనోత్సవాలు



స్వామికి పూజ చేస్తున్న అష్టాక్షరీ స్వామిజీ, పండితులు

కోడూరు: అభినవ మేల్కోటగా పేరుగాంచిన ఉల్లిపాలెంలోని గోద, రాజ్యలక్ష్మి సమేత శ్రీమన్నారాయణ స్వామి ఆలయంలో అధ్యయనోత్సవాలను భక్తిప్రపత్తులతో నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం గర్భాలయంలోని 11 అడుగుల శ్రీమన్నారాయణుడి మూలమూర్తికి విశేష పూజలు, ప్రత్యేక అలంకరణ చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన తిరుచ్చిపై ఉత్సవమూర్తులను ప్రతిష్ఠించి ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. అష్టాక్షరీ పీఠాధిపతి త్రిదండి అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజీయర్‌స్వామిజీ పర్యవేక్షణలో స్వామివార్లకు తిరుమంజన సేవను కనులపండువగా నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను వివిధ రకాల ఆభరణాలు, పూలమాలలతో అలంకరించారు. రామానుజీయర్, శ్రీచక్రం, నమాళ్వార్ల విగ్రహాలకు కూడా ప్రత్యేక పూజలు చేశారు. తమిళనాడులోని శ్రీవల్లిపుత్తూరు చెందిన పండితులు ఈ అధ్యయనోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఉత్సవాలను తిలకించేందుకు వివిధ సుదూర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది.

వైభవంగా శివ ముక్కోటి



ఉత్సవ శివలింగానికి పూజలు చేస్తున్న చైర్మన్ సాంబశివరావు



నాగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే పేర్ని నాని దంపతులు

- ఉత్తర ద్వారం నుంచి దర్శనమిచ్చిన స్వామి
- ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకాలు

నాగాయలంక: మహాశివుడి జన్మనక్షత్రంగా భావించే ఆరుద్రనక్షత్రం పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి సమన్విత పార్వతి సమేత నగరేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శివముక్కోటిని ఘనంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులు, ఉత్సవ శివలింగానికి విశేష పూజలు, అభిషేకాలు జరిపారు. ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు పర్యవేక్షణలో తొలుత ఆలయ అర్చకుడు కొల్లిపర సబ్బారావు నేతృత్వంలో క్షీరాభిషేకం, పసుపు, కుంకుమ, గంధం వివిధ రకాల ద్రవ్యాలతో విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులను ఉత్తర ద్వార దర్శనానికి అనుమతించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై శ్రీనగరేశ్వరుడిని దర్శించుకున్నారు. చైర్మన్ సాంబశివరావు మాట్లాడుతూ ఈ ఏడాది శివముక్కోటి, పౌర్ణమి కలసి వచ్చాయని ఇలా 100 ఏళ్లకు ఒకసారి మాత్రమే సంభవిస్తుందని, అమ్మవారికి ప్రీతిపాత్రమైన శుక్రవారం కూడా అనుసంధానమైందని వివరించారు. మండల ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు చిట్టా శివనాగేశ్వరరావు, మునగాల మోహనరావు, తాడికొండ సత్యనారాయణ, పొన్నూరు ప్రసాద్, దేసు సత్యనారాయణ, పంచాయతీ సభ్యుడు చిట్టా అన్నపూర్ణయ్య పాల్గొన్నారు.

శివముక్కోటికి ఆలయాలు కిటకిట

మచిలీపట్నంటౌన్: శివముక్కోటి పర్వదినం సందర్భంగా నగరంలోని ఖొజ్జిల్లిపేట నాగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉత్తరద్వారం నుంచి స్వామిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. స్వామివారికి అభిషేకాలు, అలంకారాలు చేశారు. స్వామిని ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), జయసుధ దంపతులు, వారి కుమారుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) దర్శించుకుని పూజలు చేశారు. పూజా కార్యక్రమాలను ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ రాగం ధర్మారాజు, కార్యనిర్వహణాధికారి వెంకటకృష్ణారావు, అర్చకుడు రావూరి చైతన్యకుమారశర్మ పర్యవేక్షించారు. శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో శివముక్కోటి సందర్భంగా స్వామివారిని భక్తులు ఉత్తరద్వార దర్శనం చేసుకున్నారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామివారిని పల్లకీపై ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ దేసు సుబ్రహ్మణ్యేశ్వరరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో అయ్యప్పల ఇరుముడులు



కోడూరు: నలభై రోజుల కఠోర నిష్ఠతో అయ్యప్ప మండల దీక్ష పూర్తిచేసిన భక్తులు ఇరుముడులు ధరించారు. ఉల్లిపాలెం శ్రీమన్నారాయణస్వామి, నక్కవానిదారి శ్రీరామమందిరం, విశ్వనాథపల్లి కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయాల్లో శుక్రవారం ఇరుముడుల కార్యక్రమం ఘనంగా జరిగింది. 120 మంది మాలధారులు తమ గురుస్వాముల పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు చేసి ఇరుముడులు ధరించారు. అనంతరం ప్రత్యేక వాహనాల్లో శబరిమలకు బయలుదేరి వెళ్లారు. ఆయా ఆలయాల వద్ద పెద్దఎత్తున అన్నసమారాధనలు నిర్వహించారు.

రామలింగేశ్వరుడికి జలాభిషేకం



నాగాయలంక: పౌర్ణమి, శివుడి ఆరుద్రోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక శ్రీరామ పాద క్షేత్రం వద్ద కృష్ణానదిలో నిర్మించిన మండపంలో శ్రీగంగ, పార్వతి సమేత రామలింగేశ్వర స్వామికి శుక్రవారం విశేష అభిషేకాలు, పూజలు జరిగాయి. నాగాయలంక ఆర్యవైశ్య యూత్ వంకాయల ఆది రాజేష్ ఆధ్వర్యంలో మిత్రబృందం నేతృత్వంలో 108 బిందెల పవిత్ర కృష్ణానదీ జలంలో అభిషేకించారు. అనంతరం పసుపు, కుంకుమ, విభూది, నారికేళ, గోక్షీరం తదితర ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. యువకుల్లో కనిపించిన ఆధ్యాత్మిక చింతనపై గ్రామస్తులు అభినందనలు తెలిపారు. మండపం పర్యవేక్షకులు ఉప్పల లీలా కృష్ణప్రసాద్, బోయపాటి రాము, తలశిల రఘుశేఖర్ యువకులకు సహకరించారు.

ఉత్తర ద్వార దర్శనమిచ్చిన రాజశేఖరస్వామి



అవనిగడ్డ: శివముక్కోటిని పురస్కరించుకుని స్థానిక రాజశేఖరస్వామి ఆలయంలో స్వామివారు శుక్రవారం ఉత్తర ద్వార దర్శనం ఇచ్చారు. ఆరుద్ర నక్షత్రం సందర్భంగా స్వామివార్లను ప్రత్యేకంగా ఆలంకరించారు. అనంతరం స్వామివారు ఉత్తర ద్వార దర్శనం ఇవ్వగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ సింహాద్రి రామనాథబాబు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ పి.సీతారామయ్య కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

కనులపండువగా వేంకటేశ్వరుని కల్యాణం



మచిలీపట్నంటౌన్: నగరంలోని బచ్చుపేటలో వేంచేసియున్న శ్రీ భూసమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం సాయంత్రం స్వామి శాంతి కల్యాణం కనుల పండువగా జరిగింది. అనంతరం శ్రీ పుష్పయాగం నిర్వహించారు. ఆ తరువాత భక్తులు పుష్పాలతో శోభాయాత్ర నిర్వహించారు. నగరంలోని పలు ప్రధాన రహదారుల గుండా ఈ శోభాయాత్ర సాగింది. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు కృష్ణా యూనివర్సిటీ వీసీ చంద్రశేఖర్ దంపతులు హాజరయ్యారు. ఆలయ ప్రధాన అర్చకుడు ముత్తేవి శశికాంత్ పర్యవేక్షణలో కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ వంశ పారంపర్య ధర్మకర్తల మండలి చైర్మన్ ముత్తేవి రవికాంత్, కార్యనిర్వహణాధికారి చక్రధరరావు పర్యవేక్షించారు.

నలుగురు జూదరుల అరెస్టు

గూడూరు: మండలంలోని పినగూడూరులంక సమీపంలోని డొంకల్లో శుక్రవారం పేకాడుతున్న నలుగురు జూదరులను గూడూరు పోలీసులు పట్టుకున్నారు. ఊరిచివర డొంకల్లో పేకాడుతున్నట్లు వచ్చిన పక్కా సమాచారంతో ఎస్ఐ వి.వెంకటేష్ పేకాట శిబిరంపై సిబ్బందితో దాడి చేశారు. పోలీసుల మెరుపుదాడితో అప్రమత్తమైన పేకాట రాయుళ్లు కాళ్లకు పని పెట్టారు. అయినా పోలీసు సిబ్బంది వెంబడించి నలుగురు పేకాట రాయుళ్లను పట్టుకుని, వారి నుంచి రూ.5400 నగదు స్వాధీనం చేసుకున్నారు.

విద్యార్థులకు మాస్కుల పంపిణీ

మోపిదేవి: స్థానిక బాలుర సాంఘిక సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులకు కృష్ణాజిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం మాస్కులు, హైజనిక్‌కిట్లు పంపిణీ చేశారు. రెడ్‌క్రాస్ మండల చైర్మన్ యర్రంశెట్టి సుబ్బా రావు, వైస్ చైర్మన్ రిమ్మనపూడి సుబ్రహ్మణ్యం, వసతి గృహ వార్డెన్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే పేర్ని నాని



విద్యార్థులతో ఎమ్మెల్యే పేర్ని నాని

చిలకలపూడి(మచిలీపట్నం): స్థానిక సుకర్లాబాద్‌లోని నెల్లూరు రవీంద్రభారతి పాఠశాలలో ఇటీవల నిర్వహించిన సైన్స్ ఒలంపియాడ్ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను మాజీ మంత్రి, ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) అభినందించారు. శుక్రవారం ఆయన పాఠశాలకు వెళ్లి విద్యార్థులతో సైన్స్ ప్రాముఖ్యత గురించి కొద్దిసేపు ముచ్చటించారు. పాఠశాల ప్రాంగణంలో డిసెంబర్ ఒకటో తేదీన ఒలంపియాడ్ సంస్థ నిర్వహించిన పరీక్షల్లో 119 మంది విద్యార్థులు పాల్గొనగా 44 మందికి స్వర్ణ పతకాలు రావటం అభినందనీయమన్నారు. పరీక్షలో పాల్గొన్న మిగిలిన విద్యార్థులకు హాజరు సర్టిఫికెట్లు ఇవ్వటం మంచి పరిణామమన్నారు. పాఠశాల జీఎం శివారెడ్డి, డీన్ శ్రీకాంత్, ప్రిన్సిపాల్ హరిణి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మచిలీపట్నంటౌన్: స్థానిక హౌసింగ్‌బోర్డు విద్యుత్ ఉపకేంద్రం మరమ్మతుల్లో భాగంగా శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.భాస్కరరావు తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. ఈడేపల్లిలోని శ్రీనివాసనగర్‌కాలనీ, పంచాయతీరాజ్ ఎంప్లాయిస్ కాలనీ, నారాయణపురం, పంబలగూడెం, టెంపుల్ కాలనీ, డ్రైవర్స్ కాలనీ, పాత, కొత్త హౌసింగ్‌బోర్డు కాలనీలు, మాచవరం, ఆనందపేట, వలందపాలెం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సందడిగా సంక్రాంతి పోటీలు



మ్యూజికల్స్ చైర్స్ ఆడుతున్న విద్యార్థినులు

అవనిగడ్డ: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని స్థానిక ఎస్‌వీఎల్ క్రాంతి జూనియర్ కళాశాలలో శుక్రవారం సంక్రాంతి ఆటల పోటీలు సందడిగా జరిగాయి. ఒంగుడు దూకుళ్లు, తొక్కుడు బిళ్ల, ఉప్పుల గుప్ప, మ్యూజికల్ చైర్స్ వంటి ఆటల పోటీల్లో విద్యార్థులు పోటీపడ్డారు. ఈ కార్యక్రమాన్ని కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు పర్యవేక్షించారు.

సంక్రాంతికి ప్రత్యేక బస్సు సర్వీసులు

మచిలీపట్నంటౌన్: సంక్రాంతి సందర్భంగా ఆర్టీసీ ఆధ్వర్యంలో మచిలీపట్నం నుంచి హైదరాబాద్, విశాఖపట్నం, బెంగళూరుకు 110 ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నామని డిపో మేనేజర్ టి.పెద్దిరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోజూ నడుపుతున్న షెడ్యూల్ సర్వీసులకు అదనంగా ప్రయాణికుల రద్దీ దృష్ట్యా సాధారణ చార్జీలతోనే ఈ అదనపు సర్వీసులు అందుబాటులో ఉంటాయని వివరించారు. రాను, పోనూ ప్రయాణానికి ఒకేసారి టికెట్లు బుక్ చేసుకుంటే తిరుగు ప్రయాణానికి పది శాతం రాయితీ ఇస్తామని పేర్కొన్నారు. ఆర్టీసీ ఆన్‌లైన్ రిజర్వేషన్, ఆథరైజ్డ్ టికెట్ బుకింగ్ ఏజెంట్, బస్టాండ్‌లోని టికెట్ కౌంటర్‌లో అడ్వాన్స్‌డ్ టికెట్లు పొందొచ్చని సూచించారు. శనివారం నుంచి ఈ నెల 16వ తేదీ వరకు ఈ సర్వీసులకు టికెట్లు బుక్ చేసుకోవచ్చని తెలిపారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీలు ప్రారంభం

నాగాయలంక: మండలంలోని పలు గ్రామాల్లో 2020-21, 2021-22 మార్చి వరకు జరిగిన ఉపాధి హామీ పథకం పనులపై ఆడిట్ నిమిత్తం సామాజిక బృందాలు తనిఖీలు ప్రారంభించాయని ఏపీఓ రవికుమార్ శుక్రవారం తెలిపారు. ఈ కాలంలో రూ.16.47కోట్లతో జరిగిన 2,487 పనులు, రూ.3.95 కోట్లతో జరిగిన పంచాయతీ రాజ్ శాఖ పనులకు సామాజిక తనిఖీ సభ్యులు నిర్దేశించిన షెడ్యూల్ మేరకు గ్రామసభల ద్వారా తనిఖీలు పూర్తిచేస్తారు. ఈ నెల 22వ తేదీ వరకు తనిఖీ బృందాలు గ్రామాల్లో పర్యటిస్తాయని, 24న నాగాయలంకలోని ఉపాధి హామీ కార్యాలయం వద్ద ప్రజావేదిక నిర్వహిస్తామని ఏపీఓ వివరించారు.